# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-05-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించి రాజధాని అమరావతి నిర్మాణ పనుల సహా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు.**
2. **ప్రతిఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **గ్రామాల్లో వేసవి నీటి ఎద్దడి సమస్యలను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు.**
4. **ముంబైలో జరుగుతున్న వేవ్స్ సదస్సులో ఈరోజు వేవ్ ఎక్స్, వేవ్స్ బజార్, క్రియేటివ్ ఇండియా చాలెంజ్ అవార్డుల కార్యక్రమాలు జరుగుతాయి.**
5. **రవాణాశాఖ సేవలు సులభంగా పొందేందుకు 'సారథి వాహన్ డిజిటల్ పోర్టల్'ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలంగాణా మంత్రి పొన్నంప్రభాకర్ తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అమరావతి నిర్మాణ పనుల సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు శంకుస్థాపనలు చేస్తారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి రాష్ట్రంలో పర్యటిస్తారు. సుమారు 58 వేల కోట్ల రూపాయలతో చేపట్టే పలు ప్రాజెక్టలకు నరేంద్రమోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. రాజధాని అమరావతి ప్రాంతంలో 11 వేల 240 కోట్ల రూపాయలతో చేపట్టే శాసనసభ, హైకోర్టు, సచివాలయం, ఇతర పరిపాలనా భవనాలతో పాటు వివిధ బహుళ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. ఈ సందర్భంగా సచివాలయం వెనుక ఏర్పాటు చేసిన అమరావతి పైలాన్‌ను ప్రధానమంత్రి ఆవిష్కరిస్తారు.

వీటితో పాటు దృశ్యమాధ్యమ విధానంలో 6 జాతీయ రహదారి ప్రాజెక్టులు, ఒక రైల్వే ప్రాజెక్టును ప్రారంభిస్తారు. కృష్ణాజిల్లా నాగాయలంకలోని క్షిపణి పరీక్ష కేంద్రానికి కూడా శంకుస్థాపన చేస్తారు. అలాగే విశాఖపట్నంలోని మధురవాడలో ప్రధానమంత్రి ఏక్తా మాల్‌కు శంకుస్థాపన చేస్తారు. కాగా ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యక్ష వ్యాఖ్యానం ఈరోజు ఆకాశవాణి అందించనుంది. ఎఫ్‌ఎం గోల్డ్, ఇంద్రప్రస్థ, న్యూస్ ఆన్ ఎయిర్ యాప్, ఆకాశవాణి యూట్యూబ్ ఛానెల్స్‌లో ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని వినవచ్చు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని

రాష్ట్ర మంత్రుల బృందం వెల్లడించింది. ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణకు నియమించిన పయ్యావుల కేశవ్, పి. నారాయణ, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్‌లతో కూడిన మంత్రుల బృందం నిన్న సభా వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించింది. ఈ సందర్భంగా పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ...

వాయిస్...24 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి పనుల పునః ప్రారంభానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వస్తున్న నేపథ్యంలో విజయవాడ పరిధిలో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని పోలీసు అధికారులు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నగరంలోని 175 ప్రాంతాల్లో 599 మంది ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని చెప్పారు.

---------------------------

ప్రతీ ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని నారంపేటలో పైలాన్‌ను ఆవిష్కరించి ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. అక్కడి నుంచే మరో పది నియోజకవర్గాల్లోని ఎంఎస్ఎంఈలకు, 39 ఎంఎస్ఎంఈ పార్కులకు దృశ్య మాధ్యమ విధానంలో శంకుస్థాపనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ .. 31 సెకన్లు

---------------------------

గ్రామాల్లో వేసవి నీటి ఎద్దడి సమస్యలను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తాగునీటి సమస్యలపై గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఇంజినీర్లతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, నీటి కొరత ఉన్న ప్రాంతాలను మ్యాపింగ్ చేయాలని వాటిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

---------------------------

వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ వేవ్స్ సదస్సు ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతుంది. వేవ్స్ సదస్సులో 2వ రోజైన ఈరోజు వేవ్ ఎక్స్, భారత్ పెవిలియన్, ఎగ్జిబిషన్ పెవిలియన్, వేవ్స్ బజార్, గ్లోబల్ మీడియా డైలాగ్, క్రియేటివ్ ఇండియా చాలెంజ్ అవార్డుల కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే సాంస్కృతిక, సంగీత ప్రదర్శన విభాగంలో భాంగ్రా, జాబ్రో,సంబల్‌పురి, చౌ, మణిపురి వంటి భారతీయ సాంప్రదాయ ప్రదర్శనలు జరుగుతాయి. గాయకులు శంకర్ మహదేవన్ చలనచిత్ర గీతాల ప్రదర్శన నిర్వహించనున్నారు. క్రియేటోస్పియర్, వేవ్ ఎక్స్‌పై మాస్టర్ క్లాసులు జరుగుతాయి.

వేవ్స్ సదస్సులో భాగంగా నిన్న వివిధ ప్లీనరీ సెషన్లను నిర్వహించారు. నటుడు అక్షయ్ కుమార్ వ్యాఖ్యాతగా నిలిచిన “లెజెండ్స్ & లెగసీస్: ది స్టోరీస్ దట్ షేప్డ్ ఇండియాస్ సోల్” అనే సెషన్‌లో చలన చిత్ర

ప్రముఖులు హేమ మాలిని, మోహన్ లాల్, చిరంజీవి, రజనీ కాంత్, మిథున్ చక్రవర్తి పాల్గొన్నారు. వినోద రంగంలోనూ, క్రీడా రంగంలో భారతదేశానికి అపారమైన సామర్థ్యం ఉందని అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిభను ప్రదర్శించడానికి వేవ్స్ సరైన వేదికని నటుడు చిరంజీవి పేర్కొంటూ...

వాయిస్.. 26 సెకన్లు

ఇదిలా వుండగా వేవ్స్ వేడుకల్లో అనేక మంది భారతీయ సినీ ప్రముఖులు భాగమవుతున్నారు. తెలుగు చలన చిత్ర నటులు అక్కినేని నాగార్జున ఈ సదస్సుకు హాజరయ్యారు. వేవ్స్ 2025 కంటెంట్ సృష్టికర్తలకు కొత్త మార్కెట్‌ను అందిస్తుందని అని ఆయన తెలిపారు.

---------------------------

తెలంగాణా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ-టిజిఎస్ఆర్టీసీ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సికింద్రాబాద్ తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయంలో "సారథి వాహన్ డిజిటల్ పోర్టల్"ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. సులభంగా డ్రైవింగ్ లైసెన్స్, స్లాట్ బుక్ చేసుకునేందుకు డిజిటల్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని మంత్రి తెలుపుతూ,

వాయిస్.. 26 సెకన్లు

---------------------------

వేసవి దృష్ట్యా ఎండలో పనిచేసే కార్మికులు, వృద్ధులు, పిల్లలు, ఇల్లులేని వారిని రక్షించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్-ఎన్‌హెచ్ఆర్సీ ఉభయ తెలుగు రాష్ట్రాలు సహా మొత్తం 11 రాష్ట్రాలను కోరింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతోపాటు పంజాబ్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, మహారాష్ట్ర, రాజస్థాన్‌ల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాసింది.

======================